# రీగా! రీగా!

రాత్రి పన్నెండు గంటల దాకా పడమటి సూర్యుడు ఆ హోటలు "గాజు గోడల్లోంచి" నా కళ్లల్లో పొడుస్తూనే వున్నాడు! నిద్ర పట్టిందే కాదు. ఉదయం యింకా ఆరు గంటలైనా కాలేదు. అరుణోదయమైపోయింది. మూడు దొంతరలున్న ఆ పరుపుమీద పడుకొని, బద్ధకంగా, చిరాకుగా కళ్లు తెరచి చూసేసరికి 'రీగా' నగరంలో అంబరవీధులలో, సూర్యకాంతులు మేఘాలతో దోబూచులాడుతున్నాయి! నేను కప్పుకున్న రగ్గును మోకాళ్లదాకా క్రిందికి తోసేశాను. కానీ, నన్నావరించిన ఒంటరి తనాన్ని ఎలా వదిలించుకోడం?

అది ఎనిమిదంతస్తుల హోటలు. నేమున్న గదిగోడ మొత్తం అంతా ఏకాండీ గాజుతోనే కట్టారు. అందులోనుంచి చూస్తే హోటల్‌కి వందగజాల దూరంలో స్నిగ్ధంగా ప్రవహిస్తున్న "దావుగావా"నది, దాని వెనుకగా చారిత్రాత్మకమైన అందాల "రీగా"నగరం- నీరెండలో మిలమిలలాడి పోతున్నాయి. అయితే, అన్నిటిమీదా తిష్టవేసుకుని వున్న నిశ్శబ్ద బద్ధకం నన్ను కూడా ప్రభావితం చేసినట్లుగా వుంది. ఏదో చెప్పలేని వెల్తిగా వుంది!

సంపూర్ణ పారదర్శకం అయిన ఆ గాజుగోడ కవతల కొండల మధ్య-శిఖరాగ్రం లాగ తీర్చిదిద్దిన మేడల మధ్య తొంబై మీటర్లు ఎత్తున - "డోమ్ కేథడ్రల్" (చర్చి)దాన్నెత్తిమీద "గాలి కోడిపుంజు" కనబడుతున్నాయి! మేఘాలతో మేల మాడుతున్నట్లున్న ఆ "వెదర్‌కాక్"ని చూస్తూ "హలోవ్! గుడ్‌మానింగ్"- అన్నాన్నేను.

అది 'లాత్వియా' దేశ -రాజధాని "రీగా" నగరంలో ఒక ఉదయం. "లాత్వియా" - సోవియట్ రష్యాలోని పదిహేను రిపబ్లిక్‌లలో ఒకటి. ఈ హోటల్ పేరు కూడా "హోటల్ దావుగావా" నే! ("దావుగావా" ' నదీ తీరంలోనే వుంది కదా?)

ఓ కప్పు వేడి వేడి "బెడ్ కాఫీ" తాగాలనిపించింది! "రూమ్" లో, అటూ , యిటూ చూసేను. టెలివిజన్ వుంది! ప్రక్కనే రేడియో వుంది! డెమ్కు మీద రెండు టెలిఫోన్లు పెట్టున్నాయి. కానీ, ఎనిమిది గంటలయితే తప్ప టెలివిజన్ తెర కదల్దు. అందమైన అమ్మాయి చేసే వ్యాయామ విన్యాసాలతో

టెలివిజన్ మీద ఉషోదయం కావడానికింకా రెండు గంటలు వ్యవధుంది- నిన్న రాత్రి ఒంటిగంట దాకా "డౌన్ ఫ్లోర్ రెస్టారెంటు"లో హాయిగా తాగుతూ, మజాగా తింటూ - తాపీగా ఆడా, మగా కలిసి సరదాగా కబుర్లు చెప్పుకుంటూ, మధ్యలో వున్న సర్క్యులర్ స్టేజిమీద జరుగుతున్న జిప్సీ సంగీత నృత్య కదంబ కార్యక్రమాన్ని వీక్షిస్తూ - అలసిపోయిన జనం - యిప్పుడు గాఢ నిద్రలో వుండివుంటారు. ఇది ఐరోపా ఖండం - యిక్కడిదంతా యూరోపియన్ కల్చర్ కదా!

లేచి, కూర్చుని టెలిఫోన్ అందుకున్నాను. కాని, ఎక్కడికి 'డయలు' చెయ్యడం? ఎవరికి రింగ్ చెయ్యడం?? టెలిఫోన్ క్రిందవున్న కార్డు మీద రష్యన్ భాషలోనూ, యింగ్లీషు లిపితోనే వ్రాసే లాత్వియన్ భాషలోనూ, జెర్మన్ భాషలోనూ కూడా కొన్ని టెలిఫోన్ నెంబర్ల లిస్ట్ వుంది. అందులో నుంచి, నా కప్పటికి తోచిన నెంబరొకటి తీసి, డయల్ చేశాను. గాజు గోడకవతల స్తబ్ధుగా వున్న నగరంలో చిన్న పిసరు చైతన్యం కనబడుతున్నది! టెలిఫోన్ "గాయ్... గాం...య్" మంటూంది గానీ, అవతలెవరూ ఎత్తటం లేదు. అయినా నా వంటరి తనపు వెల్తిని భర్తీ చెయ్యడాన్కి ఏదో ఒకటి చెయ్యాలి కదా!

ఆంధ్రాకి అయిదువేల కిలోమీటర్ల దూరంలో వున్నాన్నేనిప్పుడు. టెలిఫోన్ "హుక్" మీద పడేసి, ఒకసారి వొళ్లు విరుచుకుంటూ, గాజుగోడ దగ్గర నిలబడి, దావుగావా నదీతీరం వైపు దృష్టి సారించాను. "వందేమాతరం" అని గట్టిగానే దేశాన్ని తల్చుకున్నాను. "సుజలాం... సుఫలాం మాతరం" అనుకుంటూ ఆవలించేను.

"దావుగావా" తీరమంతా పచ్చిక మెత్తల మధ్య, పూల మొక్కలతో తీర్చిదిద్దబడి వుంది! ముగ్గులొక్కటే తక్కువ! నదీతీరం మెట్లన్నీ కడిగి శుభ్రం చేసినట్లున్నాయి. ఒక జట్టు 'హంసబాతులు' యీదుకుంటూ, ఉత్తరంగా పోయే నది మీద - తూర్పు పడమరలుగా వున్న రోడ్డు వంతెన క్రిందికి ఉరకలు వేస్తున్నాయి. దూరంగా "మాస్కావాఅయిలా" (మాస్కోవీధి) మీద మోటారు శకటాలు కదులు తున్నాయి!

విశాలంగా, శుభ్రంగా, ప్రశాంతంగా వున్న రోడ్లవార - "పార్కింగ్ ప్లేసులో" - కార్లూ, వ్యాన్లూ ఒంటికాలు మీద నిలబడి కునుకుతీసే జట్కాగుఱ్ఱాల్లాగ పడివున్నాయి. దూరంగా రాజమార్గాలలో "ఒకటీ అరా" ట్రాలీ బస్సులు అంటే "ఎలక్ట్రిక్ బస్సులు" ఫ్యాక్టరీ వర్కర్లనెక్కించుకుని కదులుతున్నాయి.

ముసలమ్మలు స్వెటర్‌లు తొడుక్కొని, కందికంప లాంటి యినుప కంపతో కట్టిన పొడవాటి చీపుళ్ళతో వీధులూడుస్తున్నారు. పైనుంచి చూస్తూంటే, వూరంతా ఓ బొమ్మల కొలువులో తీర్చి దిద్దినట్లు కనపడుతోంది. మధ్య మధ్య పార్కులు, పెంచిన అడవులు "పైన్" చెట్లతో కనుల పచ్చగా - ఆహ్లాదకరంగా వుంది. అవతలి దృశ్యమంతా!

"దావుగావా" నదీమతల్లిని మన "కృష్ణా" "గోదావరి" నదుల్తో పోల్చుకుని- మాతృదేశాన్ని తల్చుకోవాలనుకున్నాను. కానీ, యీ నదివొడ్డున కాలకృత్యాలు తీర్చుకునే దృశ్యాలు, ముఖ ప్రక్షాళనాలు, స్నానాలు చేస్తున్న దృశ్యాలు, బట్టలు వుతికే చప్పుళ్లు లేవు! పావురాలు, యింకేవో పేరు తెలియని బుల్

బుల్ పిట్టలు - నీరెండలో ఆడుకుంటున్నాయి. చేపలు పట్టే సరదావున్న ఒకరిద్దరు రిటైర్డు బాపతు పెద్దమనుషులు - నదిలో కాళ్లు పెట్టకుండా - దూరంగా మెట్ల మీద కూర్చుని, మరగాలం విసిరి చేపల కోసం నిరీక్షిస్తున్నారు. ఒకరిద్దరు యువకులు చెడ్డీ బనియన్లతో వ్యాయామం కోసం పరుగులు తీస్తున్నారు. అద్దాలలోనుంచి చూస్తుంటే సైలెంట్ వర్ణ చిత్రంలాగుంది అంతా!

ఐతే, కిటికీలు తెరచినా, అంతగా గందరగోళం వుండదు. ఎందుకంటే, కార్లు హారన్లు కొట్టవు! పోలీసులు యీలలు వెయ్యరు. ఓవర్ టేకింగ్‌లు, సినిమా పాటల ప్రకటనల బళ్లు, ఆటోరిక్షాలు గట్రా మచ్చుకి కూడా లేవు. మోటారు సైకిళ్లు కూడా సిటీలో తిరుగాడ కూడదు.

శబ్ద కాలుష్యం లేని ఆ దృశ్యం మీదనుంచి నా మనసు మళ్లీ "బెడ్ కాఫీ" మీదికి పోయింది. మళ్లీ టెలిఫోన్ ఎత్తి, యిన్‌ఫర్ మేషన్ డస్క్ నెంబర్ అని నేను భావించిన ఒక నెంబరు డయల్ చేశాను, కాఫీ తాగాలి, ఆనక పేపరు చదవాలి, బాత్రూంలో దూరాలి. కాని, ఏ పేపరు చదవగలం? లాత్వియా భాష పేపర్లు ఇంగ్లీషు లిపిలోనే వుంటాయిగాని - ఒక్కమాట కూడా కొరుకుడు పడదు- "పార్కు"", "హోటల్", రీగా" లాంటి మాటలు తప్ప!

ఫోన్ "గాంయ్... గాంయ్" అనడం ఆగింది" "అమ్మయ్య" - ఎవరో ఎత్తుకున్నారవతలపక్క "గుడ్ మార్నింగ్! నాకు కొంచెం సమాచారం కావాలి. యివ్వగలరా?" అంటూ ఇంగ్లీషులో అడిగాను.

అవతల నుంచి కంచుగంటలాంటి కంఠం- ఆడపిల్లదే "యంయ్ కంయ్" మంటూ వినబడ్డది! లాభంలేదనుకొని, తెలుగులోనే - "నేను ఇండియానుంచి వచ్చిన పెద్దమనిషిని- "హిందూ, రూసీ భాయీ భాయీ"- ఆంధ్రా లాత్వియా బహిన్ బహిన్", నాకు కాఫీలాంటిది కావాలి! నా చొక్కా, కోటూ యిస్త్రీ చేయించి తెచ్చిపెట్టడానికి రూమ్‌బోయ్ ఒకడు కావాలి, దొరుకుతాడా?" అంటూ అడిగాను ( అర్థం కానపుడు ఏభాష అయితే నేం?) అవతలి కంఠం - రాంగ్ స్పీడులో పడ్డ గ్రామఫోన్ రికార్డు చేసే క(య్ క(య్ సౌండందుకుంది! నా చెవుల తుప్పొదిలి పోయింది. (విశాఖపట్నం రెల్లిదాయి లాగ చెడామడా తిడుతోందేమో తెలీదు). బహుశ: - "నీ భాష గందరగోళంగా వుందయ్యా" అన్నదో లేకపోతే "రష్యన్ భాష నేర్చుకుని రావయ్యా" అన్నదో - మొత్తానికి వో నిముషం సేపు లయవిన్యాస శుభోదయంపలికి - రిసీవర్ పడేసింది...

నా "దుబాసీ శ్రీ" వున్నాడుగా క్రింది అంతస్తులో... అతనికి డయల్ చేశాను. (ప్రక్కరూము అయినా - డైరెక్ట్ డయలింగ్ టెలిఫోన్‌లే వుంటాయి అక్కడ) వుహు ... సమాధానమిళ్లై...

నిన్న సాయంకాలం ."పదకొండు గంటలదాకా (సూర్యాస్తమయం 12 గంటలకి మరి)నేను కూడా డిన్నరు హాలులో పచ్చిటమోటా ముక్కలు తింటూ - పెప్సీకోలా పీలుస్తూ - మన జ్యోతిలక్ష్మీ మార్కు కాబ్రే డాన్సులు చూస్తూ గడిపాను కాని, బోర్ కొట్టి, మా 'దుబాసీశ్రీ'కి గుడ్ నైట్ చెప్పేశాను. మనవాడు" కొన్యాక్ ఫ్రెంచి బ్రాందీ" తాగుతూ "పోర్క్", "బీఫ్" వగైరా లేవో తింటూ, అమెరికన్ 'మార్ల బోరో" మార్క్ సిగరెట్‌లు తెగపీలుస్తూ, గడిపి, రాత్రి ఏ, రెండింటికో రూమ్ చేరుకొని వుంటాడు!

ఇప్పుడు తొమ్మిదిన్నర అయితేగానీ ఆవలించడు మరి!

"బెడ్ కాఫీ కావాలా సార్?" అంటూ ఎవరూ పల్కరించరని నాకు తెలుసు. అది కావాలంటే యీ అంతస్తులోనూ - ప్రతి అంతస్తులోనూ వుండే ఫ్లోర్ రెస్టారెంటు కెళ్లాలి. క్యూలో నిలబడి "బ్లాక్ కాఫీ వితౌట్ సుగర్," ప్లస్ పంచదార బిళ్లలు తెచ్చుకుని, బుద్ధిగా టేబిల్ మీద పెట్టుకుని తాపీగా తాగాలి. అంతా సెల్ఫ్ సర్వీసు దేశం యిది. స్పెషల్ సర్వీసులున్న దేశం నుంచి వచ్చాను నేను!

ఇలా ఆలోచిస్తూ, ప్రక్కనే వున్న నిలువుటద్దంలో నా బొమ్మ చూసి, నేనే వులిక్కి పడ్డాను. నవ్వేసి - మళ్ళీ సీరియస్‌గా మిర్రర్‌లోకి చూసుకున్నాను. "అద్దం"లో... నీ "బొమ్మ" చూడూ... అది కమ్మని మాటలు ఆడూ... అన్నట్లు అనిపించింది. అద్దంలోని నా బొమ్మ కమ్మని మాటలేం ఆడలేదు గాని, నన్ను చూసి, 'ఇహీ' మంది (నవ్విందన్నమాట).

"మూగవాడివైపోయావ్! నీకు లాత్వియ బాష రాదుగా? అడుగుతున్నాడు అద్దంలోని "నేను' ', నన్నే!

"ఎందుకు రాదు? నేర్చుకొనే టైములేదు... కొంచెం కొంచెం రష్యన్ భాష మాలూమ్ హై... కావాలంటే విను... "జ్ద్రాస్త్వివిచే" అంటే "హలోవ్?" అని అర్థం.. "కాక్ జిలా" అంటే బాగున్నారా? అని... "ఓవెషి" అంటే కాయగూరలు, 'మిల్కో' అంటే పాలఅంగడి, "రేషంకా" అంటే పెరుగు 'కిఫిర్' అనగా...' '

"ఇక నోర్మూసుకో" అంది, నా బొమ్మ.

"ఇంగ్లీషు వొచ్చునన్న వెధవగర్వమూ నువ్వూ... ఇప్పుడేమయ్యావ్? నీ కోటూ, చొక్కా చిన్న సూటుకేసులో - ప్రయాణం హడావుడిలో నలిపి కుక్కేశాడు నీ మిత్రుడు దుబాసీ-" అలెగ్జాండర్ షోల్మోవ్". "దాన్ని యిస్త్రీ చేయించుకో చూద్దాం", అన్నాడు అద్దంలోని "నేను"! పైగా లాత్వియన్‌లాగ నవ్వటానికి ప్రయత్నం చేస్తున్నాడు - "నాకు లాత్వియా భాష వచ్చినా బాగుణ్ను

డ్రాయర్ మీద నేను మింగలేక పడేసిన నాన్ రొట్టె చుట్టలు చుట్టలుగా పడి వున్నది! ప్రక్కనే ఇండియా - అయామ్ సారీ, ఆంధ్రా - ఓ.... నో, సారీ...! మన బెజవాడ నుంచి తెచ్చిన "నేస్కేఫే" ప్యాకెట్ వుంది. రొట్టె చూస్తే డోకొచ్చింది కాని, కాఫీపొడి ప్యాకెట్ చూస్తే వేణ్ణీళ్లుంటే బాగుణ్ను, అందులో దీన్ని మిళాయించినన్... ఆహ! డీడీర్... అనగా ఇన్‌స్టెంట్ కాఫీ తయారగునుగా?" అన్నాను అద్దంలోకి చూస్తూ, గొప్పగా! 'అగును పొమ్ము' అన్నాడు చెయ్యి విదిలించి అద్దంలోని నేను.

అవతల చలిగా వుంది... కారిడార్‌లోకి తొంగి చూశాను.. యింకా "ఫ్లోర్ సూపర్నెంటమ్మ!" కూడా రాలేదు. రెస్టారెంటులో ఏమీ సందడి లేదు.

బాత్రూంలోకి వెళ్ళాను... క్లోరినేటెడ్ వాటర్ అయితేనేం... వేణ్ణీళ్లు వస్తాయిగా.. హాట్ వాటర్ టాప్ యిప్పేను... వేలు చురుకుతుందేమోనని - తాపీగా దాని క్రింద పెట్టేను..." "చురుక్" మంది!

కాని యిది వేడి కాదు .... చలి!! హోటల్ వాటరేకీ బద్ధకమే.. ఇంకా వేళకాలేదో యేమో ననుకున్నాను. దంతధావనం ముగించాను. "ఛీ... ఛీ... యిన్నాళ్లనుంచి యీ అయిడియా రాకపోయింది! నాలుగు పేకెట్లు ఇన్‌స్టెంట్ కాఫీని "సోవనీర్'లుగా (జ్ఞాపక చిహ్నాలుగా) పంచి పెట్టేశాను! బ్లాక్ కాఫీకి యీ పది రోజులలోనూ అలవాటు పడ్డాను కనుక అదే హాయిగా కలుపుకుని తాగితే పోలా...?"

అద్దాల కిటికీ తెరిచాను. కాస్త... 'దావుగావానది' చేసే రొదను మించి పోయి 'రీగా' నగరం, 'హోరు' మంటోంది. చలివిరిగిన గాలి ముక్కుల నిండా పీల్చుకొని "స్పసీబా-! మిత్రమా... నాకు వేణ్ణీళ్ళు దొరికాయో... వెంటనే కాఫీ రెడీ చేస్తానోయ్ నీకు" అన్నాను వెనుతిరిగి మిర్రర్‌లోకి చూస్తూ-" అద్దంలోని నా బొమ్మతో.

స్పసీబా అంటే రష్యన్ భాషలో ధన్యవాదాలు అని అర్థం (అంటే 'థాంక్స్ అన్నమాట)" అన్నాను. "నాకు తెల్సులేవోయ్ ఆ సంగతి కాని, లాత్వియన్ భాషలో ఏమంటారో అడుగు మీ దుబాసీని", అన్నాడు అద్దంలో నేను.

మన కామ్రేడ్‌కి అంటే 'దుబాసీ'క్కూడా లాత్వియా నై అతాహై... అందరికీ రష్యన్ భాష బాగావచ్చుగా - అంతా 'స్పసీబా' అంటారు! నేనూ అలాగే "చార్‌సౌబీస్'లో రాజకపూర్‌లాగ కొంచెం ముందుకి వంగి, యిలా 'స్పసీబా' అంటాను. అంటూ, "ఎయిర్ యిండియా మారాజులా'గా ముందుకి వొంగి యాక్షన్ చేశాను.

"పదిగంటలకి లాత్వియన్ యూనివర్శిటీలో మహాశిల్పి ఈగర్ వాసిల్యేవ్‌తో అప్పాయింట్ మెంట్ వుంది... అది చూడు ముందు, ఆనక యీ స్పసీబాలు" అంటూ అద్దంలోని నా బొమ్మ భ్రుకుటి ముడిచింది!

నేను బాత్రూంలోకి దూసుకున్నాను. ఈ దుబాసీ అనవసరంగా నా చొక్కాల్ని అడ్డదిడ్డంగా సూట్‌కేసులో క్రుక్కేయకపోతే- నాకు 'దోబీ'గారు ఐమీన్ ఇస్త్రీగారు అక్కర్లేదు. గాని - విమానానికి టమయిపోతోందోనంటూ పెట్టి సర్దుకోడం కూడా రాని నా 'యిండియన్ కల్చర్'ని తిడుతూ దుబాసీశ్రీ 'నా పెట్టి అలా సర్దాడు! నేనేడుపు మొహం పెట్టి - 'స్పసీబా' అన్నాను. ఈ దావుగా నదీ తీరానగల 'రీగా' నగరం నడిబొడ్డున యీ మహా హోటల్ లోపల "యెట్లు? ఇస్త్రీ కావలెనని అడుగుటెట్లు? కాఫీ కాచుటెట్లు?" బాత్ టబ్‌లోకి హాట్ వాటర్ టాప్ వొదిలి, గెడ్డాం చేసుకుంటూ (గీసుకుంటూ అనాలా తెలుగులో) ఆలోచిస్తున్నాను. ఇక్కడ అందరూ స్త్రీలే... అయితేనేం? ఆ 'స్త్రీ'లను 'యిస్త్రీ' కావాలని అడుగుట ఎట్లో తెలియడం లేదు, ఎటు చూసినా చక్కని అతివలే అన్ని పనులూ చేస్తున్నారు. చూడ ముచ్చటగా వుంది!

స్వీపర్‌గర్ల్ వస్తుందేమోనని చూస్తే- మనం రూమ్‌లో వుండగా 'స్వీపర్ గాళ్' రాదట! "హేయ్ ! అల్లా! గాడ్!!! పరమాత్మా!! (దేశసమైక్యత వర్ధిల్లాలి కదా అందుకని యిలా)... అయితే, నాకు వేరే డ్రస్సులున్నాయ్. వై వర్రీ?" అనుకుంటూ నీళ్లల్లోకి (టబ్‌లోకి) దిగాను. అబ్బే... దిగలేదు. దిగుదామని

కాళ్లు - కాళ్లు కూడా కాదు - ఒక కాలు పెట్టబోతే - "జివ్వు"మంది.. అవి చన్నీళ్ళు- అన్నీ చన్నీళ్లే...'! బాత్ టబ్ అంతా! నోహాట్ వాటర్??? గరమ్ పానీ ఆయా నహీ? వేడినీరు రాలేదా? సూడాతన్నీ వరాదా?... ఏ భాషలో అంటేనేం? రష్యన్ భాషలో ఆ వొక్క ముక్కా రాలేదుగా... వీడున్నాడు మా దుబాసీ శ్రీ"- ఎందుకు? ఏమీ చెప్పడు. వాడి భాషని 'రూబుల్స్" 'కోపెక్కు' ల్లాగ (రూపాయి, పైసల్లాగ) దాచుకుంటాడు. హాట్ వాటర్ పోసుకోడానికి క్కూడా గతి లేదు? చన్నీటి స్నానమా? కార్తీకస్నానం కూడా ఎప్పుడూ చెయ్యలేదే- ఐరోపా ఖండంలోని లాత్వియాలోనా - ఔరా! చన్నీటి స్నానమా? చచ్చే చలి స్నా...న...మా?

కాని, యిది రెండుదేశాల మైత్రికి, అంతర్జాతీయ సహకారానికి, అవగాహనకీ, సంబంధించిన విషయం కనుక - వెంటనే బాత్ టబ్‌లో -జిబ్రిష్ భాషలో దవడలు వొణికిస్తూ ఏదో అంటూ, దిగి స్నానం బాచరించాను.

సూటూ బూటూ బిగించేసుకోవాలనుకున్నాను... ఏదో సామెత చెప్పినట్లు ఎనిమిది అంతస్థుల 'దావుగావా హోటేల్లో' వేణ్ణీటికే కరువా? అనుకుంటూ సీసాలో వున్న నారింజనీళ్లు - నలభై కొపెక్కులు (రష్యన్ పైసలు)తో కొనుక్కున్న ఆరెంజి నీళ్ల త్రాగాను ( దవడల మాట అడక్కండి).

అంతలో తలుపు తెరుచుకుంది! మా 'దుబాసీశ్రీ' అనుకున్నాను. కాదు... స్వీపర్‌గర్ల్... తప్పు పని చేస్తూ దొరికిపోయిన వాడిలాగ - టక్కున ఆరెంజ్ వాటర్ బాటిల్ అక్కడ పెట్టేశాను. 'యిహీ' అన్నాను. (అవును మరి. బ్రాందీ, విస్కీ, జిన్ లాంటివేవో వో గుక్క పట్టుకోకుండా త్రాగే ఐరోపా ఖండంబున యేమీ యీ భారత ఖండపు ఉషఃపానము)

ఆవిడకి పాతిక ముప్పయి ఏళ్లుంటాయేమో? లాత్వియన్లు జర్మనీ వాళ్లలాగ ఎర్రతొక్కలో వుంటారు. బొద్దుగా వుంది.. అంటే ఫ్లోర్ లేడీ. అనగా 'సూపర్నెంటమ్మ' కాదు. రూమ్ లేడీయే అనుకున్నాను. ఆవిడ గౌనుమీద "ఏప్రాను' కట్టుకుంది. చిన్న మీసకట్టు కూడా వుందామెకి!...

"కాక్‌జిలా' అన్నాను. 'ఇందియా' అన్నాను. ఆత్మీయంగా నవ్వింది. "బాత్రూమ్ క్లీన్ చెయ్యానా?' ' అంది సైగలతో అంతలో నాకో అయిడియా వచ్చింది. బల్లమీదున్న చాక్లెట్లు రెండు తీసి, ఆమెకి యిచ్చాను. నా సొరుగులో వున్న యిండియన్ 'విచ్చురూపాయి (కాయన్) కాసు తీసి యిస్తూ", యిది 'సొవనీర్'గా వుంచుకోమన్నాను. వెంటనే గ్రహించింది. కాని ఆ చాక్లెట్‌నే (మన అగ్గిపెట్టెంత వున్న దాన్ని) అటూ, యిటూ తిప్పి - రుసికీ.. రూసికా అని తీసి పారేస్తున్నట్లు నవ్వింది- అక్కడ పడేసింది!

"అయ్యో! ఇది రష్యన్‌దే కదా? దీన్నిస్తావేమిటోయ్ నాకు మిత్రమా!" అన్నట్లు నాకర్థమయింది. వెంటనే నాసూట్‌కేసు మూత ఎత్తి - మన న్యూట్రిన్ చాక్లెట్లు చిన్నవి కదాని నాలుగు తీసి ఇచ్చాను. ఆమె మొహం 'నెమలి పింఛం విసనకర్ర'లాగ వికసించింది.

"స్పసీబా... స్పసీబా" అంటూ ముందుకి వంగి థాంక్స్ చెప్పింది...రూపాయి కాసు నటూ యిటూ త్రిప్పి చూస్తూ.. బాత్రూంలోకి వెళ్ళింది. నేనీలోగా నాకు చాతనైన ఏకైక ధూపం వెలిగించాను!

మాంచి అగరబత్తీలు - మన యిండియావి నాలుగు పెట్టెలు తెచ్చాను నాతో... రూంలో ఆ విదేశీ వాసన జాగాలో స్వదేశీ వాసన ఘుమఘుమా వచ్చింది! ఈ లోగా మన ఫ్రెండు బాత్రూంలోనుంచి యివతలకి వచ్చింది!! ఊదొత్తుల సువాసననీ, ధూపాన్నీ కూడా చిత్రంగా హాయిగా చూసింది... మన పిల్లలు జెట్ విమానం చూసినట్లు. "ఊమ్మ్మ్" అంటూ సువాసనని ఆఘ్రాణించి, వోహో! ఎంత బాగుంది అన్నట్లు రెండు చేతులూ బారజాపి అభినయించింది!

నాకు గర్వంగా వుంది. మా యిద్దరి మధ్యా ఒక భాష ఏర్పడి నట్లు ధైర్యం వచ్చింది. వెంటనే రెండు వూదొత్తులు అపురూపంగా తీసిచ్చేను. "సావనీర్... సావనీర్" అన్నాను. ఆ అమ్మాయి వాటినందుకుని 'స్పసీబా".. అంటూనే పరమానందంగా నాకు షేక్ హ్యాండిచ్చింది. నాకు ఎంతో గౌరవం అందినట్లుగా ఫీలయ్యేను ( మన దేశంలో రూమ్ బాయ్స్‌కి, స్వీపర్స్‌కీ షేక్ హాండ్ యిస్తామా... వుహూ).

నేను నా చొక్కా, కోటూ వున్న హేంగర్స్ చూపించి వీటిని యిస్త్రీ చెయ్యగలవా? అంటూ సైగలతో... నాభాషలో నేను మాట్లాడుతూనే (అంటే తెలుగు కాదు ఇంగ్లీషు అన్నమాట) అడిగేను. నిజానికి నాకు 'యిస్త్రీ' పట్టుదల పెరిగిపోతోంది... అదో పిచ్చి అయింది.

'వో...యిస్త్రీనా?' అన్నట్లు సంగీత భరితంగా మాట్లాడుతూ (లాత్వియన్లు సంగీత ప్రియులు. భాష కూడా వినడానికి వీనుల విందుగా వుంటుంది) అడిగి... నేను చేసి పెడతాను.. 'యిస్త్రీ పెట్టి మరో అంతస్తులో (?) వున్న వాళ్ల దగ్గర వుంది" అంటూ చెప్పింది. "నువ్వు బయటికి పోయిరా" అన్నట్లు నాకు అర్థమయింది. మళ్లీ యిద్దరం 'స్పసీబా'... 'స్పసీబాలు' చెప్పుకున్నాం.

"అమ్మయ్య! "దుబాసీశ్రీ' లేకుండా నేను మేనేజ్ చెయ్యగలను' అనుకున్నాను.

టైము తొమ్మిదయింది! టెలివిజన్‌లో న్యూస్ అయిపోయింది. ఏదో 'నారెన్ నారెన్ననారా' అంటూ సంగీత నృత్యం వస్తోంది! ఫ్లోరు రెస్టారెంటుకి వెళ్లాను. అప్పటికే క్యూ వుంది. 'పోర్క్' బీఫ్ లాంటివి ప్లేట్లలో సర్ది, అద్దాల బీరువాలో నీట్‌గా అమర్చారు! రెడీగా కాఫీ డికాషన్ పెర్కోలేటర్‌లో వుంది. కిఫిర్ (మీగడలాంటిది) కాఫీ, పంచదార బిళ్లలు- వ్రేళ్లతో సంకేతించాను!

రెస్టారెంటు అమ్మడు దగ్గర అవి తీసుకున్నాను... నల్లని కురులు, కాటుక కళ్లు, తెల్లని దంతపు బొమ్మలాగా వుందామ్మాయి. నల్లని గౌను, మెడలో ఒక బంగారు గొలుసులో 'క్రాసు' వేసుకున్న ఆ అమ్మాయికి (గవర్నమెంటు వుద్యోగిని అయినా, ఆ పిల్ల యిష్టం ఆమెదన్నమాట!)- నేనో రూబుల్ కాయితం యిచ్చాను. చిల్లర తీసి, బల్లమీద పరిచి, లెక్క పెట్టి, నా వేపు త్రోసింది 'స్పసీబా' అన్నాను!

అంతా నిశ్శబ్దంగా వుంది. కాని దుకాణంలాగ రణగొణ ధ్వని లేదు! ఓ బల్ల దగ్గర కూచున్నాను. కాఫీ డికాషన్ చల్లారి పోతోంది. ప్రొద్దున్నే 'కిఫిర్' తిందామా అంటే గొంతులోంచి దిగనంటోంది! మదనపు వాసన వస్తోంది!! పంచదార బిళ్ల వొకటి డికాషన్‌లో వేశాను. చెంచాతో కలిపితే, అది చల్లారి పోతుంది...చలి దేశంకదా!

నా ఎదురుగుండా 'బామ్మగారు' ఒకామె కూర్చునుంది. కాఫీ తెచ్చి పెట్టుకుని - చెంచాతో

పంచదార బిళ్ల కరిగేలా తిప్పుతూనే - నావేపు ఆప్యాయంగా, వాత్సల్యంగా చూస్తోంది. విచిత్రమే! వేడి దేశం మనది. అన్నీ వేడిగా కావాలో అని గోల పెడతాం మనం... అలాగే ఈ చలి దేశంలో వాళ్లు అన్నీ చల్లగా తింటూంటారు!!

ఈ బామ్మగారు "రంగురంగుల పూల స్కార్ఫ్" తలకి చుట్టుకుంది. ముగ్గుబుట్ట అయిపోయిన తల ముడుతలు పడ్డ మొహం-కానీ, పెదాలు విప్పకుండా, సన్నని నవ్వుతో -ఆమె పలకరించే తీరు- "ఈమెనేకదూ నిన్న ఉదయం లగేజీ కీపర్ రూములో చూశాను" అని నాకు జ్ఞాపకం చేసింది.

"జ్డ్రాస్తావిచే" అన్నాను వెంటనే

"జ్డ్రాస్తావిచే" అంటూ బోసినోటితో ఏమో చెప్పింది! వెర్రి మొహం వేశాను. నా రష్యన్ పాండిత్యం 'హలోవ్' వరకే. ఇంతకీ ఆమె లాత్వియన్ భాషలో మాట్లాడిందేమో. బామ్మగారి మాటల్లో 'యిందియా, యిందియా' అన్నమాటలే తెలిశాయి! ఆమె మాంసంతో చేసిన 'సాండ్‌విచ్' తింటోంది.

"తినవా?" అనడిగింది. తల అడ్డంగా తిప్పేను!!

ఈ వయసులో, మన దేశంలో 'బామ్మ'లైతే, ఉద్యోగాలు ఎందుకు చెయ్యాలి? అని చెయ్యనివ్వం మనం. కాని యిక్కడ మనుష్యులు చాలరు - ఎవరి పనులు వాళ్లకే, ఎవరి ఆర్జన వాళ్లకే యిష్టం అనుకున్నాను. ఇంతలో నా దుబాసీ వచ్చాడు. 'బామ్మగారు తల చుట్టూచేతులు తిప్పుతున్నది. గెడ్డాం క్రింద తొండంలా చెయ్యి పెట్టి సైగలు చేస్తున్నది. ఏమిటో చూడు అన్నాను.

"దుబాసీశ్రీ" కాఫీ తెచ్చుకుని, బామ్మని కదిపేడు.. ఆమె అడిగింది యిదీ..." నిన్న మీ యిందియా నుంచి కొంతమంది నెత్తిమీద టర్బనులు, ముక్కు క్రింద గెడ్డాలూ పెట్టుకొని- అంతెత్తు బూచాళ్లలాంటి వాళ్లు; వచ్చారు. చూశావా? నువ్వు? మరి నీకు టర్బనూ, గెడ్డాం లేవేమీ?" అన్నదామె కుతూహలం. భారతీయత అంటేయీ పంజాబీల గెడ్డాలూ, తలపాగాలూ అనుకున్నదన్నమాట! (ఔరా!) నేను చిన్న లెక్చరిచ్చాను. యింకా నిద్రమత్తులో వున్న 'దుబాసీశ్రీ' కొంత చెప్పాడు. కొంత మింగేశాడు. 'లీవిట్ ఐసే' అన్నాడు బాధగా...

బోసినవ్వుతో మామ్మగారు చేతికున్న చిన్ని వాచీ చూసుకుంటూ లేచింది... "నాది క్లోక్‌రూం డ్యూటీ... పోతాను" అంటూ అప్యాయంగా నా తల నిమిరింది. వీపు నిమిరింది. బొజ్జవైపు తర్జనీతో చూపించి," తిండి తిను. లేకపోతే నీర్సం వస్తుంది. యిలా సోలిపోతావ్,' అంటూ సోలిపోయే భంగిమ పెట్టి చూపించింది! నేను లేచి, ఆమెకి 'స్పసీబా' చెప్పి గౌరవం ప్రదర్శించాను.

"పాపం! ఈవయసులో ఆమెకి వుద్యోగమా?," అన్నాను ఇంగ్లీషులో.

"వై పిటీ? షి లైక్సిట్," అన్నాడు దుబాసీశ్రీ కోపంగా.

ఈ బామ్మగారి చిరునవ్వు నాకు చాలా బలంయిచ్చింది. శిల్పి ఈ గార్ వాసిల్యేవ్‌గారింట నెహ్రూ, కాళిదాసుల దారు శిల్పాలు చూశాను. ఇండియా మీద, ఆయుర్వేదం మీద, శాఖాహారం మీద

అతనెన్నో ప్రశ్నలు అడిగాడు. తిరుగుదలలో రాత్రి రూము చేరుకున్నాకే, మళ్లీ నాబల్ల మీద కాఫీపొడి పేకెట్ నన్ను పల్కరించింది. "అయ్యో! నా "హాట్ వాటర్!" రష్యన్ భాషలో ఏమందురు దానిని?"

వేణ్ణీళ్ల పంపు యిప్పి ఆశగా చూశాను.

"ఓహ్! నో హాట్ వాటర్?" అనుకున్నాను. నీటి గొట్టాలు రిపేరు చేస్తున్నారుట, రానున్న శీతాకాలం కోసం! ఇది వాళ్ల సమ్మర్ (1982 ఆగస్టు నెల) అంచేత వేణ్ణీళ్లు రావు! అట్లా అని లాత్వియా భాషలో - ఎక్కడో బోర్డు పెట్టేరట. రాత్రి పదకొండు అయినా సూర్యుడింకా మొహం అటువేపు తిప్పుకోలేదు! దుస్తులు మార్చుకుని, మఫ్లర్ మెడలో వేసుకొని బయటికి వెళ్దామనుకున్నాను. అంతలో గోడనున్న మేకుకి నా రెండు షర్టులూ - నీళ్లోడుతూ కనబడ్డాయి. గుండెఝల్లుమంది. "ఇదేమిరా ఆంధ్రుడా!" అనుకున్నాను. వాటిని తీసి చూశాను.

మన"ఫ్రెండు - రూమ్‌లేడీ" నా చొక్కాలు - డ్రైక్లీనింగ్ చేయించ లేదు - ఇండియా నుంచి తెచ్చుకున్న టెర్రీపూల్ చొక్కాలు రెండు - యించక్కా వుతికి, నీడన వ్రేలాడదీసింది... బాత్‌రూంలోకి పోయి చూశాను. నేను ఉదయం వదిలిపెట్టి పోయిన మైసూరు సాండల్ సబ్బు సువాసనగా, నామ మాత్రంగా మిగిలి వుంది. ఇస్త్రీ చెయ్యక పోగా, ఉతికిపడేసింది పుణ్యాత్మురాలు. (భాషా! భాషా! నువ్వు పుట్టక ముందు మనుషులెలా బ్రతికే వాళ్లు?) ఇవి ఆరడం ఎట్లా? రేపురాత్రి లెనిన్‌గ్రాడ్ రైలెక్కాలే - దుఃఖపడ్డాను. గట్టిగానే! టెలివిజన్‌లో, ఢాం... ఢాం అని యుద్ధం సీను అయిపోతోంది - నా దుఃఖానికి బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ లాగా...

పదకొండున్నరయింది. వీధి దీపాలు వెలుగుతున్నాయి! అప్పుడే - బయటికి వచ్చాను... ఫ్లోర్ సెంటర్లో లిఫ్టల ప్రక్కన ఆ అంతస్తు యిన్‌ఛార్జీ అమ్మాయి కూర్చుని, స్వెటర్ అల్లుకుంటూ (కడుపుతోవుంది కాబోలు) టెలివిజన్ చూస్తోంది! ఎదురుగా మేజా మీద ఒక హీటర్ వుంది. హీటర్ మీద కెటిల్లో నీళ్లు మరుగుతూ కనబడ్డాయి!

నా ప్రాణం లేచి వచ్చింది. దగ్గరగా వెళ్లాను. "ఇహీ" మని నవ్వాను. కానీ లాభం లేక పోయింది! "నాకు అవి కావాలి", అనిహీటర్ వేపు సంకేతించాను. ఆ అమ్మాయి నవ్వలేదు. చేతులు మాత్రం అడ్డంగా వూపుతూ, తన భాషలో ఏమో చెప్పింది. నా కర్థమయిందంతా - "అబ్బాయ్! యివి నీకు యివ్వడానికి కాదు. బయటికి నడూ" అని మాత్రమే! ఆ పిల్ల ప్రక్కన లాత్వియా పేపరు 'చినా' చూశాను. దాని డాక్ ఎడిషన్‌లో, మొదటి పుటలో, మూడు కాలమ్‌ల "బాక్సుఐటమ్" వుంది. అందులో నా గురించీ - నేను ఆ పత్రికా కార్యాలయాన్ని చూసినప్పటి విషయాలే వున్నాయి. కాని, ఆ అమ్మాయికి - ఆ నేను యీ నేనే" - అని ఎలా చెప్పడం? కాఫీ దాహం ఎక్కువయింది. వొళ్లు మండి పోయింది.

తిన్నగా, క్రింద ఫ్లోర్‌లో వున్న నా "దుబాసీశ్రీ" రూముకి దిగిపోయాను. "టాక్... టాక్"మని తలుపు కొట్టాను. వెంటనే తలుపు తియ్యలేదు... మరింత దుఃఖం వచ్చింది. డాలర్సు కొద్దిగా, మరికొన్ని రూబుల్సు వున్నాయి నా దగ్గర, కాని ఎందుకూ? ఓ గ్లాసుడు వేణ్ణీళ్లు లేకపోయాక? దుబాసీశ్రీ

బాత్రూంలోంచి యిండియన్ స్టయిల్లో అంటే పైన జబ్బా లేకుండా, కేవలం చిన్ని నిక్కరు తొడుక్కొని, దర్శనం యిచ్చాడు. "యేం చేస్తున్నావ్?" అన్నాను. వచ్చి చూడమన్నాడు. బాత్రూంలోకి తొంగి చూశాను. సన్‌లైట్ సబ్బు అంటే చాలా యిష్టం అతనికి. అది నేను స్నేహ కానుకగా (సొవనీర్) యిచ్చాను. దానితో తన గ్యాబర్డీను ప్యాంటు వుతుకు తున్నాడు. (మన స్టారు హోటల్సులో యిలాంటి పన్లు చెయ్యనివ్వరు) చెయ్యనిచ్చినా యెవ్వడూ చెయ్యడు కూడా... పరువు తక్కువకదా!

నేను నా ప్రాబ్లమ్ చెప్పాను. ఫ్లోర్‌లేడీ అందంగానే వుంది. కాని, అనాకారిగా మాట్లాడింది. అన్నాను. "యంగ్ డెవిల్" అన్నాను.

"నిన్న బాల్‌రూమ్ డాన్సు ఫ్లోరులో రష్యన్‌గాల్స్ అంతా "లిటిల్ ఏంజిల్స్" అన్నావు? యిప్పుడు డెవిల్స్ అంటున్నావు?" అన్నాడు సిగరెట్ ముట్టించుకుంటూ తాపీగా "దుబాసీశ్రీ"

"ఓ...హెల్?" అన్నాను నేను.

పాపం, మరో పావుగంటలో నాతో ఏడో అంతస్తుకి ఎక్కివచ్చాడు. ఫ్లోర్ లేడీతో పోట్లాడకూడదు మనం. ఆమె గవర్నమెంట్ సర్వెంట్ కదా?" అంటూ సణిగాడు త్రోవలో...

ఫ్లోర్ లేడీ గంభీరంగా వుంది. దుబాసీశ్రీ ఏదో చెప్పాడు - ఆ అమ్మాయితో. నా వేపుముందు కొరకొరా చూసింది. తర్వాత ఫెళ్ళున నవ్వింది. గణ గణమంటూ మాట్లాడే ఆ అమ్మాయి ఎంత ఆరోగ్యంగా వుంటూందో ఆ పలువరసే చెబుతోంది. కాని,నేను మొహం అప్రసన్నంగా పెట్టాను.

నేను దిగ్రేట్ యిండియా నుంచి వచ్చాను. యిన్నివేల కిలోమీటర్ల దూరం - మా దేశంలో అయితేనా? "అతిథి దేవోభవ!" అంటూ ఎన్ని మర్యాదలు చేస్తారో... ఛీ...ఛీ.. రష్యన్ కల్చర్ అంటూ నా చూపులతోనే, లెక్చర్ నిశ్శబ్దంగా దంచేస్తున్నాను నేను.

ఆ అమ్మాయి నవ్వేసరికి, కొరడాదెబ్బతిన్నట్లు అయింది. "ఏమయ్యా! మహా రచయితా! ఈ హీటర్ కావాలన్నావుటా? అది యివ్వరు" అంటూ దుబాసీ పకపకా నవ్వాడు. ("రీగా!రీగా! సరిగ్గా అర్థం చేసుకోలేదు నన్ను నువ్వు)

ఈలోగా ఆ ప్రౌఢ గోడ కున్న అద్దాల బీరువా లోంచి ఓ గ్లాసు హోల్డరు తీసి, అందులో పలుచని గాజు గ్లాసు వుంచి (రీగా గాజు గ్లాసులకి ప్రసిద్ధి) కెటిల్లో ముంచి, వేణ్ణీళ్లు దాన్నిండా పోసి ద్రాక్షపళ్లంత కనుగ్రుడ్లు మెరిసేలాగ నవ్వుతూ, నా వేపు చూసింది. అవి అందుకొని "స్పసీబా" అన్నాను నేను అప్రయత్నంగా!

"ఇంతకీ యీహాట్ వాటర్ని యేమంటారో తెలియక, యింత అవస్థ పడ్డాను. నువ్వు చెప్పవు-నాకు ఆ మాట రాదు. దాంతో వచ్చిన రష్యన్ మాటలు కూడా మరిచిపోయాను." అన్నాను దబాసీని నిందిస్తూ అతనూ జర్నలిస్టేగా! (అదో మాదిరిగా నవ్వుతాడు)

నేను నీకు తర్జుమా దారునేగానీ, మాటలు నేర్పే టీచర్ని కానుగా" అన్నాడు నవ్వుతూ - నా అవస్థని ఎంజోయ్ చేస్తూ.

ఇంతకీ హాట్ వాటర్ని ఏమనాలో చెప్పనేలేదు. (రష్యన్‌లోనూ, లాత్వియా భాషలోనూ కూడా)

ఆ అమ్మాయి వేపు చూవాను.. చేతివ్రేళ్లు గాలిలో గోకుతున్నట్లుగా వూపుతూ, నాక్కూడా చిలిపిగా "గుడ్‌నైట్" చెప్పింది. గొప్ప హాయిగా వుంది నాకు! నేను వెనక్కి తిరిగి, వేణ్ణీళ్లు చూపించి - "వీటిని ఏమంటారు? అంటూ సైగలు చేశాను.

"ఓహో (చాలా మాటలు మాట్లాడింది)... "గరియేచవాదా" - అంది చివర నవ్వుతూ "గరియేచవాదా" అంటే వేణ్ణీళ్లు అన్నమాట. ఆ అమ్మాయి నవ్వుతూనే వుంది. నేను "గరీయేచవాదా' '... గరియేచవాదా" అని వల్లించుకుంటూ నా రూము చేరాను.

రూములో పంచదార పాలు లేని యిన్‌స్టెంట్ కాఫీ త్రాగేం నేనూ - దుబాసీమిత్రుడూ. తర్వాత 'గుడ్‌బై' చెప్పుకున్నాం.

నాకు నిజంగా, హాయిగా నిద్రపట్టింది. "గరియేచవాదా" ఎంతపని చేసింది?. అన్నట్లు నా "చొక్కా" లింకా ఆరలేదు. ఓ గంట నిద్రపోయాక కొట్టినట్లు తెలివొచ్చింది. ఉలిక్కి పడ్డాను రూము తలుపు గడియపెట్టలేదు - లేట్ పార్టీనుంచి కొందరు సందడిగా తిరిగి రూములు చేరుకుంటున్న చప్పుడు కారిడార్‌లో... "దావుగావా ఆయిలా" (వీధిలో దీపాలు వంటరిగా వెలుగుతున్నాయి.

లేచి, గ్లాసు హోల్డరూ గ్లాసూ తీసికొని నడవలోకి వచ్చాను. కార్పెట్ మీద కూడా అడుగులు వేస్తూంటే చలికి జివ్వుమంటున్నాయి. అందమయిన ఫ్లోర్‌లేడి పుస్తకం చదువుకుంటోంది. ('తెగచదువుతారు వీళ్లు) తల ఎత్తి, ప్రశ్నార్థకంగా చూసింది. "స్పసీబా" అన్నాను గ్లాసు అందిస్తూ. "స్పసీబా ఫర్ గరియేచవాదా" అన్నాను.

నా పేరు చెప్పాను. పరిచయం చేసుకుంటున్నట్లు ఆమె బల్లమీద వున్న "చివా" అన్న పేపరు తీసి, అందులో నా గురించి పడ్డ అయిటమ్ చూపించి, యిది నేనే ... నేనే.... అంటూ సైగలు చేశాను. ("దుబాసిశ్రీ" బద్ధకస్తుడు ఏం చెప్పడు).

ఆ అమ్మాయి అది క్షణంలో చదివేసింది. లేచి నిలబడి "షేక్ హ్యాండ్)" యిచ్చింది తన పేరు అలెగ్జాండ్రా" అని చెప్పింది. ఇండియా యిందియా అన్న మాటలే తెలిశాయి నాకు. ఆనక "గుడ్ బైలు"చెప్పుకున్నాం!

ఎప్పుడో మూడు గంటలకి నిద్రపట్టింది నాకు.

ప్రొద్దున్నే నా రూమ్ తలుపు "టక్ టక్" మంటూ చప్పుడవుతోంది. ఈ దేశం కాని దేశంలో, ప్రొద్దున్నే సూర్యభగవానుడు తప్ప నన్ను పలకరించేదెవర్రా?" అనుకుంటూ లేచాను. టైము అయిదున్నరవుతోంది. మెల్లిగా వెళ్లి తలుపులు సంకోచంగా తెరిచాను.

ఒక్కసారి నిద్రమత్తు దిగిపోయింది. వెలుపలి చలిగాలి రివ్వున వచ్చేందేమోగానీ, అది నాకు వెచ్చగానే తగిలింది... ఎందుకంటే...

మెరిసిపోయే బంగారు కురులు భుజాలమీదికి జాలు వారుతూవున్న - దంతం బొమ్మలాంటి - ప్రౌఢ అక్కడ! దానిమ్మపండు గింజల్లాంటి పలువరుస పగుల, వెన్నెలలా నవ్వుతూ నిలబడి వుంది. - ఏంబర్ పూసల బ్రేస్‌లెట్ ధరించిన ఆమె కుడిచేత, రకరకాల నగిషీలు చెక్కిన నికిల్ ప్లేటు గ్లాసు హోల్డరు వుంది. అందులో పల్చని 'రీగా' గాజు గ్లాసులో - ఆవిరులు వస్తున్న వేణ్ణీళ్లు - అందులో వెండి మలామా వున్న చెంచావున్నాయి. అవాక్కయి పోయిన నేను తేరుకొని - "ఓహ్" - అన్నాను.

"గరియేచవాదా" - అన్నదామె. గాజు గళాసులో మంచి ముత్యాలు వొలకబోస్తున్నట్లు మంజుల స్వరంతో నవ్వుతోంది - ఆ లాత్వియన్ బ్యూటీ అలెగ్జాండ్రా!

"స్పసీబా!... ప్లీజ్ డూ కమిన్' అన్నానేన్నను తడబడిపోతూ.

ఇప్పుడు కాదు. డ్యూటీ మీదున్నానన్నట్లు సైగ చేసింది. చక్రాలున్న దంతం బొమ్మలాగ కారిడోర్ మలుపు తిరిగి పోయింది.

హాయిగా వేణ్ణీళ్లల్లో యిన్‌స్టెంట్ కాఫీపొడి కలుపుకుని త్రాగేశాను. తృప్తిగా వుంది!

దుబాసయ్య వచ్చే సరికి నేను కోటు కూడా వేసుకొని రెడీగా వున్నాను.

"హలోవ్.. రీగారి, గా రిగా సరిగా, రిరిగా సరి, మా సా, రిగా రిగా!" అంటూ కర్నాటక సంగీతాన్ని ఖూనీ చేస్తూ కూనిరాగాలు తీస్తూ అతణ్ణి లోపలికి ఆహ్వానించాను!

"మీ రీగా బాగుందోయ్ గిరీశం!" అన్నాను తెలుగులో (ఛస్తే అర్థం కాదుగా అతగాడికి)

"వ్వాట్!" అన్నాడు షోల్మోవ్ (తెలివైనవాడు) "నాకు లాత్వియన్లు" నచ్చారు - వాళ్ల ఆతిధ్యం బాగుంటుంది" అన్నాను "సోకాల్డ్ లింగ్వా ఫ్రాంకా ఆఫ్ ది వరల్డ్" (యింగ్లీషు) లోకి మారి పోయాను.

"అయామే రష్యన్.. మైండ్‌యూ.. లెట్స్‌గో" అంటూ బయటికి లాగాడు జోరుగా - "మనం లేట్ అయిపోతున్నాం". అన్నాడు.

"అలెగ్జాండ్రా" జాగాలో లావుపాటి రష్యన్‌అమ్మాయి వుందప్పుడు.. స్వెట్టర్ అల్లేసుకుంటోంది జోరుగా!

**(1993,పల్లకి)**

రీగా!రీగా! కథాకాలం 1982-83. కథా స్థలం నాటికి సోవియట్ రిపబ్లిక్‌గా వున్న 'బాల్టిక్' రాజ్యంలోని 'లాత్వియా' దేశం రాజధాని 'రీగా' నగరం. అందులో ప్రవహించే నది "దావుగావా"- అదే పేరుగల టూరిస్ట్ గ్రాండ్ హొటేల్. అటు తర్వాత 'లాత్వియా' స్వతంత్ర దేశంగా అవతరించింది. అక్కడి బాల్టిక్ సముద్ర తీరం గొప్ప ఆరోగ్యకేంద్రం ప్రజలంతా సంగీత ప్రియులు. జర్మనీ కల్చర్ ప్రియులు-నా రష్యా పర్యటనానంతరం అక్కడి లొకేషన్స్‌తో రాసిన మూడు కథలలో యిది ఒకటి.

-రచయిత